# ఓటర్ల నమోదుపై విస్తృత అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ, చిత్రంలో ఆర్డీవో చిన్నయ్య తదితరులు

**చిత్తూరు అర్బన్:** ఓటర్ల జాబితా సవరణ –2023 కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఏఈఆర్వో, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ అరుణ ఆదేశించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంపై ఈఆర్వో, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్యతో కలిసి చిత్తూరు నియోజకవర్గ బీఎల్వోలతో జెడ్పీ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఇటీవల ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజలు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తెలుసుకునే వెసులుబాటు కల్పించాలని సూచించారు. ఇదే సమయంలో నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3వ తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు, అవగాహన కల్పించాలని చెప్పారు. బీఎల్వోలు కచ్చితంగా పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉండడంతోపాటు కొత్త ఓటర్ల నమోదు, సవరణల కోసం దరఖాస్తులు స్వీకరించాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, సవరణల దరఖాస్తుల్లో అన్ని వివరాలు సక్రమంగా నమోదు చేయించాలని, అవసరమైన పత్రాలు కచ్చితంగా జత చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ సౌందర్ రాజన్, ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్ ఆఫీసర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

**ఓటు హక్కును నమోదు చేసుకోండి**

**యాదమరి:** మండల పరిధిలో 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ హనుమంతు కోరారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్‌ఓలకు, బీఎల్‌ఓలకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఈ నెల 4వ తేదీ నుంచి మూడు రోజుల పాటు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండాలని, ఓటు హక్కులో చేర్పులు, మార్పులు చేసుకునేవారు చేసుకోవచ్చని చెప్పారు.

**కొత్త ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపులు**

**తవణంపల్లె:** యువత ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవడానికి వీలుగా రెండు రోజులపాటు ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో కొత్త ఓటర్ల నమోదుపై బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవడానికి అర్హులన్నారు. ఈ నెల 4, 5 తేదీల్లో బీఎల్‌ఓల దగ్గర ఆయా పోలింగ్ కేంద్రాల్లోనే నమోదు చేసుకోవాలని సూచించారు. బీఎల్‌ఓలు కొత్త ఓటర్ల నమోదు వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీటీ నరేష్ కుమార్, భూ రీ సర్వే డీటీ వెంకటరమణ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

**ముసాయిదా జాబితాను పరిశీలించుకోండి**

**చిత్తూరు కలెక్టరేట్:** చిత్తూరు డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లో ఓటర్ల ముసాయిదా జాబితాను ఓటర్లు పరిశీలించుకోవాలని ఆర్డీవో చిన్నయ్య అన్నారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఓటు నమోదుకు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. ఓటు నమోదు కోసం ఈ నెల 3, 4 తేదీల్లో, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ శిబిరాలను ఓటర్లు వినియోగించుకోవాలని కోరారు. ముసాయిదా జాబితాలో తమ పేరు ఉన్నదీ, లేనిదీ, ఏవైనా తప్పులు ఉన్నాయా అన్నది పరిశీలించుకోవాలని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఏవో రామాంజులునాయక్, చిత్తూరు తహసీల్దార్ మురళిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మంత్రిని కలిసిన ఐరాల నాయకులు


మంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు, ఐరాల మండల నాయకులు

**కాణిపాకం(యాదమరి):** విజయవాడలో విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఐరాల మండల కన్వీనర్ బజ్జిరెడ్డితోపాటు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి మండలంలోని సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించి విన్నవించారు. కార్యక్రమంలో కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, నాయకులు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల తనిఖీ


పరీక్ష కేంద్రం తనిఖీ చేస్తున్న వెంకటరమణా రెడ్డి

**తవణంపల్లె:** విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలపై అంచనా కోసం నిర్వహించిన పరీక్షలను శుక్రవారం జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి, ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి తనిఖీ చేశారు. మండలంలో ఎంపిక చేసిన 19 పాఠశాలల్లో విద్యార్థులకు అభ్యసనా సామర్థ్యాలు పరిశీలించడానికి పరీక్షలు నిర్వహించారు. మండలంలోని అరగొండ, బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్షలను తనిఖీ చేశారు. అరగొండ బాలికల హైస్కూల్ హెచ్‌ఎం మోహన్ రెడ్డి, ఫీల్డ్ ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

### రాష్ట్ర పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం కోమల

**ఐరాల:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్–17 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు శుక్రవారం హెచ్‌ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల పుత్తూరు ఎస్‌ఆర్‌ఎస్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వ హించిన జిల్లా స్థాయి అండర్–17 సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జ్యోతీశ్వర్, తులసినాథ్, హేమలత, వర్షిణి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు శనివారం నుంచి ఒంగోలులో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ దేవా, క్రీడాకారులను పేరెంట్స్ కమిటీ చైర్మన్ రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

### బేస్‌బాల్ పోటీలకు..

**చిత్తూరు రూరల్:** చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రమేష్, పీడీ హేమాద్రి తెలిపారు. గత నెల తిరుపతిలో జరిగిన ఎంపిక పోటీల్లో అండర్–14 విభాగంలో అర్మాన్, అండర్–17కు అభిషేక్ ఎంపికైనట్లు తెలిపారు. గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటున్నారని చెప్పారు. ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

## ప్రశాంతంగా జీవించండి

**చిత్తూరు రూరల్:** పల్లెల్లో గొడవలు లేకుండా ప్రశాంతంగా జీవించాలని బీఎన్‌ఆర్‌పేట ఎస్‌ఐ వెంకటసుబ్బమ్మ పేర్కొన్నారు. చిత్తూరు మండలం కుర్చివేడు గ్రామంలో శుక్రవారం రాత్రి ఆమె గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఊళ్లో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. పగలు పెంచుకుని గొడవలకు దిగడం మంచిది కాదన్నారు. కేసుల వరకు వెళితే జీవితాంతం ఇబ్బందులు తప్పవని చెప్పారు. భూ తగదాలను సంబంధిత అధికారుల సమక్షంలో పరిష్కరించుకునేలా చూడాలని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ రవి తదితరులున్నారు.

## వరసిద్ధుని సేవలో పురందేశ్వరి



**కాణిపాకం(యాదమరి):** కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి దర్శించుకున్నారు. ఆమె శుక్రవారం ఉదయం స్వామివారి దర్శనార్థం కాణిపాకం విచ్చేయగా ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం కాణిపాకం పంచాయతీలోని అగరంపల్లె వద్ద మండల బీజేపీ కార్యాలయాన్ని పురందేశ్వరి ప్రారంభించారు.

## ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం


మాట్లాడుతున్న అనిల్‌కుమార్, రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్

**బంగారుపాళెం:** ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోందని ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని నలగాంపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని పీడీవీ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 337 మంది రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు ఎలాంటి ఖర్చులేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్ రాయన్ మాట్లాడుతూ, ప్రతి నిరుపేద ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం ధ్యేయమన్నారు. మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పూర్తయ్యాయని చెప్పారు. అనంతరం వృద్ధులకు వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. స్థానిక సర్పంచ్ షీబా, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభునాయుడు, శంకర్‌నాయుడు, లోకేష్, విజయకుమార్, రమణ, డాక్టర్లు యుగంధర్, లోకేష్, ప్రీతి, సంధ్య, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సాధికార యాత్ర విజయవంతం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**చిత్తూరు కార్పొరేషన్:** సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేసిన ప్రజలకు, పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కట్టమంచిలోని కల్యాణ మండపంలో జరిగిన తటస్తుల సమావేశం అక్కడి నుంచి సాగిన బస్సు యాత్ర, బహిరంగ సభ దిగ్విజయంగా ముగిసిందన్నారు. దీనికి ఉపముఖ్యమంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్‌తోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరై జయప్రదం చేశారన్నారు. పోలీసులు ఆంక్షలను ప్రజలకు తెలియజేసి సహకారం అందించారన్నారు. మీడియా కూడా ఆశించినంత సహకారం ఇచ్చిందన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర అధ్యక్షులు టిమ్ము, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా పటేల్ జయంతి


ఐటీసీఎల్‌లో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించిన అధికారులు

**యాదమరి:** భారత దేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని తిరుపతి రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఈశ్వర్ రెడ్డి అన్నారు. జాతీయ ఏక్తాదివస్ అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఐటీసీఎల్‌లో అవినీతి నిర్మూలనపై అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఐటీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విశేష ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీఎల్ అధికారులు అమితాబ్, ఆంజనేయులు, పూజిత, యాదమరి ఎస్‌ఐ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## కేఎం రెడ్డి సేవలు శ్లాఘనీయం


కేఎం రెడ్డికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**గుడిపాల:** మండలంలోని బొమ్మసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యవస్థాపకులైన కేఎం రెడ్డి సేవలు శ్లాఘనీయమని మాజీ ఉపవిద్యాధికారి చంద్రమ్మ తెలిపారు. మండలంలో కేఎం రెడ్డి 63వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బొమ్మసముద్రం ప్రాంతానికి కేఎం రెడ్డి చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం కేఎంరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యాలయాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.20వేలు ప్రోత్సాహకాలుగా అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపల్ శరత్‌చంద్రశేఖర్, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయండి


సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లోని జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్లను సకాలంలో పూర్తి చేయించాలని మునిసిపల్ కమిషనర్ డాక్టర్ జె అరుణ అధికారులను ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని అనుప్పల్లి జగనన్న లేఅవుట్ సందర్శించారు. లేఔట్‌లో ఖాళీ ఇంటి స్థలాలను పరిశీలించారు. ఇంటి స్థలాలు పొందిన వారంతా ఇల్లు నిర్మాణాలు ప్రారంభించేలా సంబంధిత లబ్ధిదారులను కలిసి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం హౌసింగ్ అధికారులు, నోడల్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. అన్ని లేఅవుట్ల పరిధిలో పలు దశల్లో ఉన్న నిర్మాణాలను వచ్చేనెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. అధికారుల వారీగా రోజువారీ, వారాంతపు లక్ష్యాలను నిర్దేశించుకుని ఇలా నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీధర్, నోడల్ అధికారి నరసింహ, వార్డు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**ఉద్యానవనాన్ని తీర్చిదిద్దండి**

గిరింపేట దుర్గమ్మ ఆలయం వద్దనున్న ఉద్యానవనాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. దుర్గమ్మ ఆలయం వద్దనున్న వనాన్ని పరిశీలించి వనంలో పిచ్చి మొక్కలను సత్వరం తొలగించాలని, సుందరంగా ఉంచే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం ఉన్నారు.

## ప్రతి శుక్రవారం డ్రైడేని పాటించాలి

**యాదమరి:** గ్రామీణ ప్రజలు డ్రైడేని ప్రతి శుక్రవారం పాటించాలని సంతగేటు ప్రభుత్వాస్పత్రి వైద్యులు అనిల్‌కుమార్ నాయక్ అన్నారు. మండలంలోని యాదమరి ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాపిశెట్టి కండ్రిగ గ్రామంలో శుక్రవారం వైద్యులు డ్రైడే నిర్వహించారు. గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేయించి పెనాయిల్ చల్లారు. అనంతరం గ్రామీణ ప్రజలకు సమావేశం ఏర్పాటు చేసి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం నీరునిల్వ ఉన్న పాత్రలను ఖాళీ చేసి ఆరబెట్టి, డ్రైడేగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పీఎఫ్ విభాగం తనిఖీ

**చిత్తూరు కార్పొరేషన్:** జెడ్పీ కార్యాలయంలోని పీఎఫ్ విభాగంలో జెడ్పీ పరిధిలోని ఉద్యోగులు, టీచర్ల పీఎఫ్ మొత్తాల వివరాల నమోదుపై ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శుక్రవారం సీఈఓ ప్రభాకర్‌రెడ్డి నమోదును ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఎఫ్ జమ, రిజిస్టర్ల నిర్వహణ, కంప్యూటర్‌లో ఖాతాలను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. శ్రీకాళహస్తి డీఎల్‌డీఓ ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆర్‌ఎస్‌ఐ కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుడి భార్యకు చెక్ అందజేస్తున్న ఏఎస్పీ సుధాకర్

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు పోలీసుశాఖలో ఆర్‌ఎస్‌ఐగా పనిచేస్తూ మృతి చెందిన కమల్‌నాథ్‌రెడ్డి కుటుంబానికి అధికారులు ఆర్థికసాయం అందజేశారు. చిత్తూరులోని పోలీసు కార్యాలయంలో శుక్రవారం మృతుడి సతీమణి విజయలక్ష్మికి రూ.75 వేల చెక్‌ను ఏఎస్పీ సుధాకర్ చేతులమీదుగా అందించారు. గతనెల 11వ తేదీ కమల్‌నాథ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఏఎస్పీ మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి జిల్లా పోలీసుశాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని, ఏ సాయం కావాల్సినా ఎస్పీని సంప్రదించవచ్చని చెప్పారు.

## గ్రామీణులకు ఫ్యామిలీ డాక్టర్ సేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

**గుడిపాల:** మండలంలోని వసంతాపురంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి హరి అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని 189 కొత్తపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి హరి 49 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఉమ, సుజిమ చంద్ర, ప్రవీణ్ పాల్గొన్నారు.

**ఐలవారిపల్లెలో..**

**ఐరాల:** మండలంలోని ఐలవారిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ 104 శిబిరంలో 87 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

**గ్రామీణులకు వరం**

**తవణంపల్లె:** ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు ప్రియాంక, వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలో శుక్రవారం మత్యంలో డాక్టర్ వినయ్‌కుమార్, ఎగువ తవణంపల్లెలో డాక్టర్ ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 95 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.